సాక్షి
ఖమ్మం
మంగళవారం । 25 । జూన్ । 2024



ఎరువులు సిద్ధం

వానాకాలం సీజన్‌లో సాగు చేసే పంటల ఆధారంగా రైతులకు అవసరమైన ఎరువులను జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తోంది. 8లో



హామీల అమలుకు ఒత్తిడి

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే ఒత్తిడి తీసుకొస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 27°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

గృహజ్యోతి దరఖాస్తులకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: గృహజ్యోతి పథకం దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం గతంలో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతవాసులు మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సత్తుపల్లి డిపోలో ఆర్ఎం తనిఖీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోను సోమవారం ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా అధికారులు, ఉద్యోగులు సమావేశమై డిపో స్థితిగతులపై చర్చించారు. అలాగే, బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు, వసతులపై ఆరా తీశారు. చాన్నాళ్లుగా బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న షాపులతో పాటు సైకిల్ స్టాండ్ నిర్వహణకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆర్ఎం తెలిపారు. డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, ఉద్యోగులు విజయశ్రీ, బాలస్వామి నాగరాజు, కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జనరల్ విభాగం ప్రథమ సంవత్సరం పరీక్షలకు జిల్లా నుంచి 9,950మంది హాజరు కాగా 6,679మంది(67.13శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే,ఒకేషనల్ విభాగంలో 990మందికి గాను 487మంది(49.19శాతం) ఉతీర్ణులయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో పరీక్షలకు 3,992మందికి 1,807మంది(45.25శాతం), ఒకేషనల్ విభాగంలో 653మందికి 319మంది(48.85శాతం) ఉత్తీర్ణత సాధించారు. కాగా, విద్యార్థులు మెమోలను tgbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. అలాగే, రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు వెబ్‌సైట్‌లోని స్టూడెంట్ ఆన్‌లైన్ సర్వీసెస్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాల కోసం 99489 04023 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ప్రజావాణిలో 32 దరఖాస్తులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కార్యాలయాలతో పాటు సర్కిల్ కార్యాలయంలోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహజ్యోతి, కేటగిరీ మార్పు, అధిక బిల్లులు, అధిక లోడ్, ఇళ్లపై నుంచి వెళ్తున్న లైన్ల తొలగింపు తదితర సమస్యలపై 32 దరఖాస్తులు అందాయి. ఖమ్మం టౌన్-1 సెక్షన్ పరిధిలోని బొక్కలగడ్డకు చెందిన వినియోగదారులు విద్యుత్ లైన్, స్తంభాల సమస్యపై ఎస్ఈ ఏ.సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, అందిన దరఖాస్తులన్నింటినీ సంస్థ వెబ్‌సైట్‌లో నమోదు చేసినట్లు ఎస్ఈ తెలిపారు.

బారులు తీరిన ఫిర్యాదుదారులు



ఫిర్యాదుల నమోదు కేంద్రం వద్ద రద్దీ



బారులు దీరారు...

గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

- వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ మధుసూదన్
- పరిష్కారంపై అధికారులకు సూచనలు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల కోడ్ ముగియడం, కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరించాక నిర్వహించిన మొదటి గ్రీవెన్స్ డే కావడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణికి ప్రజలు బారులుదీరారు. ఉదయం 10గంటల నుంచే పెద్దసంఖ్యలో వినతులు, ఫిర్యాదులతో చేరుకున్నారు. ఈమేరకు సిబ్బంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి ఆ తర్వాత అధికారుల వద్దకు పంపించారు. అయితే, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఫిర్యాదులన్నీ పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత అంశాలతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్‌కార్డుల కోసమే ఎక్కువ దరఖాస్తులు అందినట్లు తెలిసింది. డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వినోద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

ప్రభుత్వ గురుకులాలు, వసతిగృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సంక్షేమ శాఖల అధికారులు, ఆర్‌సీఓలు, వసతిగృహాలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. పరిశుభ్రత, వసతి, భోజన సదుపాయాల్లో లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలని, మెనూ కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు. ఉన్నతాధికారులు తనిఖీ చేసినప్పుడు నిర్లక్ష్యం వహించినట్లు తేలితే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీలు వచ్చినా ఇవ్వలేదు



గత ప్రభుత్వం 21మంది దివ్యాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను మంజూరు చేసింది. ఇవి జిల్లాకు చేరినా ఎన్నికల కోడ్ తదితర కారణాలతో ఏడాది కాలంగా పంపిణీ చేయడం లేదు. అధికారులు తక్షణమే స్పందించి స్కూటీలను ఇప్పించి మా సమస్యను పరిష్కరించాలి.
– బొమ్మన అరుణ్‌కుమార్, నాచారం, ఏన్కూరు మండలం

వైకల్యం తగ్గించారు...



నేను సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నా. గతంలో వైకల్యం 82శాతంగా నమోదు చేస్తే, ఈసారి సున్నాగా నమోదైంది. ఇరవై ఏళ్లుగా సదరం సర్టిఫికెట్ ఆధారంగా పెన్షన్ పొందుతున్నా. ఇప్పుడు నష్టపోయే అవకాశమున్నందున మళ్లీ సవరించి కొత్త సర్టిఫికెట్ ఇవ్వాలి.
– బోదపోతుల కల్పన, లక్ష్మీపురం, కొణిజర్ల మండలం



ఇల్లు ఇప్పించండి సార్

ఏళ్లుగా ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నాం. తిరుమలాయపాలెం మండలానికి చెందిన నేను ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్పలో అద్దెకు ఉంటున్నా. పదేళ్లుగా దరఖాస్తు చేసుకుంటున్నా ఫలితం లేదు. ఇప్పుడైనా ఇల్లు మంజూరు చేసి నా గూడు గోస తీర్చాలి.
– దిరిశాల జ్యోతి, రాజీవ్‌గృహకల్ప, ఖమ్మం

కేఎంసీ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య

నేడు బాధ్యతలు స్వీకరణ



కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్‌లను సోమవారం బదిలీ చేసిన ప్రభుత్వం అగస్త్యను కేఎంసీ కమిషనర్‌గా నియమించింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన 2022 నవంబర్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా మొదటిసారి బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈనెల 15న జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా కేటాయించగా ఖాళీగా ఉన్న ఈ స్థానంలో అగస్త్యను నియమించారు.

ఖమ్మం చేరుకున్న కమిషనర్

కేఎంసీ కమిషనర్‌గా నియమితులైన అభిషేక్ అగస్త్య మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్‌గా సోమవారం సాయంత్రమే రిలీవ్ అయి ఖమ్మం చేరుకున్నారు. కాగా, అగస్త్య స్వస్థలం జమ్మూ కాశ్మీర్. ఆయన తండ్రి దర్శన్ రైనా అధ్యాపకుడిగా, తల్లి నిర్మలశర్మ ఉపాధ్యాయురాలుగా కొనసాగుతున్నారు. కాగా, అభిషేక్ విద్యాభ్యాసమంతా జమ్మూ కాశ్మీర్‌లోనే కొనసాగింది.

విద్యార్థులు వంద శాతం హాజరుకావాలి



ఎస్సెస్సీ విద్యార్థులకు గణితం బోధిస్తున్న డీఈఓ శర్మ

సత్తుపల్లి: హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి తరగతులకు హాజరయ్యేలా చూడాలని డీఈఓ సోమశేఖరశర్మ ఆదేశించారు. సత్తుపల్లి బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. అయితే, విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంపై ఆరా తీయగా హాస్టల్ విద్యార్థులు ఇంకా రాకపోవడమే కారణమని ఉపాధ్యాయులు తెలిపా రు. దీంతో తల్లిదండ్రులకు ఫోన్ చేసి వంద శాతం హాజరు నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు డీఈఓ గణితం బోధించారు. అలాగే, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయిని మాదిరాజు మాలతిని సన్మానించారు. ఎంఈఓ బి.రాములు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల పరిశీలన

కల్లూరు రూరల్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి కల్లూరులో సోమవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలను డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వీరికి 28, 29వ తేదీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారు. మండల నోడల్ అధికారి పత్తిపాటి నివేదిత, ఎంఈఓ దామోదరప్రసాద్, పీఈటీలు వీరరాఘవయ్య, కె.రామకృష్ణ, త్రివేణితో పాటు సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వపై మూడు వంతెనలు

- రూ.16కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు
- జాబితాలో టేకులపల్లి వద్ద క్రాస్ రెగ్యులేటరీ కూడా..



క్రాస్ రెగ్యులేటరీ నిర్మించనున్న టేకులపల్లి వంతెన

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రధాన కాల్వపై మూడు చోట్ల వంతెనలు నిర్మించనున్నారు. ఈమేరకు జలవనరులశాఖ అధికారులు రూ.16 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు సమర్పించారు. గతంలో ఉన్న ఒక వంతెన శిథిలం కావడంతో దాని స్థానంలోనే కాక రెండు కొత్త నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా ఖమ్మం నడిబొడ్డున ఉన్న టేకులపల్లి వంతెనను ఆనుకుని కాల్వ వద్ద లకారం చెరువుకు తాగునీటిని మళ్లించేందుకు ఏటా అడ్డుకట్ట వేయాల్సి వస్తోంది. ఇక్కడ శాశ్వతంగా క్రాస్ రెగ్యులేటరీ నిర్మాణానికి రూ.6.6 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సమర్పించారు. అలాగే, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం – వేపకుంట్ల రహదారిలో సాగర్ కాల్వపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి రూ.6.5 కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. ఇక ఏన్కూరు మండలం రాయమాదారం గ్రామ సమీపాన వంతెన లేక ప్రజలు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో ప్రజల వినతి మేరకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సూచనల మేరకు వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ మూడు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైతే ప్రజల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు టేకులపల్లి వద్ద ఏటా లకారానికి తాగునీటి మళ్లింపు కోసం అడ్డుకట్ట వేసే పని లేకుండా రెగ్యులేటరీ షట్టర్లతో సులువవుతుంది.

డీసీసీబీలో రూ.908 కోట్ల రుణమాఫీ

- 1.69లక్షల మంది రైతుల వివరాలతో ప్రతిపాదనలు
- వెల్లడించిన బ్యాంకు చైర్మన్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన జీఎంలు పద్మావతి, నర్మద

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ ప్రకటన మేరకు డీసీసీబీ పరిధిలోని వంద పీఏసీఎస్‌ల ద్వారా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రూ.2లక్షల మేర 1,69,868 మంది రైతులు రూ.908.28 కోట్ల రుణాలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో 1,67,036 మంది రూ.844.84 కోట్ల పంట రుణాలు రెన్యూవల్ చేసుకోగా, మిగిలినవి కొత్త రుణాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రతిపాదనల ఆధారంగా రుణమాఫీకి అర్హుల వివరాలను ప్రభుత్వం గుర్తిస్తుందని తెలిపారు.

రూ.3 వేల కోట్లు దాటిన టర్నోవర్

డీసీసీబీ టర్నోవర్ రూ.3 వేల కోట్లు దాటడం ఆనందంగా ఉందని చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. రూ.2,900 కోట్లుగాలావాదేవీలు పెరిగి రూ.3,043 కోట్లకు చేరాయని చెప్పారు. బ్యాంకు నుంచి జేఎల్‌జీ(జాయింట్ లయబుల్ గ్రూప్స్) వంటి రుణాల రికవరీ పెరగగా, అప్పులను రూ.39 కోట్లకు తీసుకొచ్చామని తెలిపారు. అలాగే, ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులకు అవసరమైన రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు ఆకుల పద్మావతి, కాకర్ల నర్మద పాల్గొన్నారు.

ప్రారంభమైన హాస్టల్ వార్డెన్ నియామక పరీక్షలు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: హాస్టల్ సంక్షేమ అధికారుల ఎంపికకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన ఈనెల 29వ తేదీ వరకు జరగనున్న సీబీఆర్‌టీ(కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో పరీక్షకు 1,609మంది అభ్యర్థులకు గాను 1,104మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. కాగా, ఖమ్మం రూరల్ మండలం కొత్తూరులోని డేర్ కళాశాల కేంద్రంలో సర్వర్ సమస్య కారణంగా మధ్యాహ్నం పరీక్ష 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.

‘ఉపాధి’పై ఆరా..

- పనిదినాలు పెరగడంపై నివేదిక కోరిన కేంద్రం
- పూర్తి వివరాలు సమర్పించిన జిల్లా యంత్రాంగం
- త్వరలో తనిఖీలు చేపట్టే అవకాశం



ఉపాధి పనులకు హాజరైన కూలీలు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం పనిదినాలు పూర్తి కావడంపై కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుండి మే వరకు అత్యధిక పనిదినాలు పూర్తి చేసిన జిల్లాల్లో పనిదినాలు పెరగడం, పూర్తి చేయడం తదితర అంశాలపై నివేదిక కోరింది. ఈమేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఆర్‌డీఏ అధికారులు నివేదికలను సిద్ధం చేసి పంపించినట్లు సమాచారం. అయితే కేంద్రప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అదనంగా పనిదినాలు పూర్తి చేయడంతో అందుకు సంబంధించి బడ్జెట్ విడుదల చేయాలన్నా, అదనపు పనిదినాలు ఇవ్వాలన్నా అధికారులు నివేదికలే ప్రామాణికమని తెలుస్తోంది.

పదేళ్ల తర్వాత ఇప్పుడే...

ఉపాధి హామీ పథకం ప్రారంభమయ్యాక జిల్లాలో ఒక ఏడాది అత్యధికంగా కోటి వరకు పని దినాలను కల్పించారు. పదేళ్ల క్రితం కరువు రోజుల్లో కల్పించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఆ ఏడాదికూడా ఏప్రిల్, మే, జూన్‌లో 40 లక్షల పనిదినాలను మాత్రమే కల్పించినట్లు సమాచారం. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం ఇప్పటివరకు(జూన్ 23వ తేదీ) మూడు నెలల్లోనే 50,94,942 పని దినాలను కల్పించడంపై కేంద్రప్రభుత్వంలోని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలతో నివేదిక సిద్ధం చేసిన జిల్లా అధికారులు సోమవారం పంపించినట్లు తెలిసింది.

వర్షాలు, వ్యవసాయ పనులు లేక..

వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది ముందుగానే వ్యవసాయ పనులు ముగిశాయి. దీంతో ఎండాకాలం ఆరంభం నుంచే గ్రామీణ ప్రాంత కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపారు. ఈ నేపథ్యాన ఏప్రిల్, మే నెలల్లో కూలీలు ఎక్కువగా ఉపాధి పనులకు హాజరుకావడంతో ఎక్కువ పనిదినాలు కల్పించాల్సి వచ్చిందని అధికారులు నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. అంతేకాక గత మూడు నాలుగేళ్లకు సంబంధించిన పంటల సాగు, ఉత్పత్తుల వివరాలను సైతం జత చేసినట్లు సమాచారం. కాగా, పని అడిగిన ప్రతీ కూలీకి అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు పని కల్పిస్తే ఇన్ని పని దినాలు ఎలా అయ్యాయని నివేదిక కోరడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు. పని చేయించినా, చేయించకున్నా తమకు తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.

పనులపై తనిఖీలు..

ఈ మూడు నెలల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పథకం ద్వారా కూలీలు చేసిన పనులను కేంద్ర బృందం త్వరలో తనిఖీ చేయనుంది. జిల్లా అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగానే తనిఖీలు చేయనున్నట్లు తెలిసింది. అలాగే, ఇటీవల ఉపాధి పథకం సిబ్బందిపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా అధికారులు కామేపల్లి మండలంలో విజిలెన్స్ తనిఖీ చేయించేందుకు సిద్ధమయ్యారు.

ఈ ఏడాది జిల్లాలో ఉపాధి హామీ వివరాలు..	పని పొందిన కుటుంబాలు	పని చేసిన కూలీలు	గడిచిన మూడు నెలల్లో పూర్తయిన పనిదినాలు
	1,43,216	2,27,826	50,94,942 (ఇప్పటివరకు)

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు?

- రేషన్‌కార్డుల్లో చేర్పుల కోసం దరఖాస్తులు
- 2017నుంచి కొత్త పేర్లు నమోదుచేయని వైనం
- ఏడేళ్లుగా వేచిచూస్తున్న 38,479 మంది



ఖమ్మం సహకారనగర్: రేషన్‌కార్డు లబ్ధిదారుల ఏళ్ల నాటి ఎదురుచూపులు ఫలించడం లేదు. కనీసం సమస్య పరిష్కారమవుతుందో, లేదో కూడా తెలియక గోస పడుతున్నారు. రేషన్‌కార్డులు పొందిన కుటుంబాల్లో పలువురికి పిల్లలు జన్మించగా.. ఇంకొందరికి వివాహాలు జరిగాయి. దీంతో పిల్లల పేర్లు, కొత్త కోడళ్ల పేర్లు చేర్చాలని దరఖాస్తు చేసుకోగా పరిష్కారానికి నోచుకోలేదు. 2017 సంవత్సరం గత ఏడాది చివరి నాటికి 38,479మంది దరఖాస్తులు రాగా అవన్నీ వివిధ దశల్లో పెండింగ్ ఉన్నాయి.

పేర్లు ఎక్కించండి సార్....

2017 నుంచి 2023 ఏడాది చివరి వరకు అంతకు ముందే కార్డులు తీసుకున్న వారు కుటుంబాల్లో కొత్త సభ్యుల పేర్ల నమోదుకు గాను దరఖాస్తు చేసుకున్నారు. ఇలా జిల్లాలోని 21 మండలాల పరిధిలో 38,479మంది మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించారు. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 6,819 దరఖాస్తులు రాగా, వేంసూరు మండలంలో 910దరఖాస్తులు అందాయి. ఇవన్నీ పెండింగ్‌లోనే ఉండగా.. బియ్యం సహా ఇతర అంశాల్లో లబ్ధి చేకూరడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

విచారణ ఎప్పుడో?

రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని దరఖాస్తులు వెల్లువెత్తినా, నాటి ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో విచారణ చేపట్టేందుకు సైతం అధికారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. జిల్లాలో అందిన దరఖాస్తులన్నీ ఆర్‌ఐలు, తహసీల్దార్లు, ఏఎస్‌ఓలు, డీఎస్‌ఓల వద్ద పెండింగ్ ఉన్నాయి. అయితే, ఈ దరఖాస్తులను ఎప్పుడు పరిశీలిస్తారు.. ఎప్పుడు కొత్త పేర్లు నమోదు చేస్తారన్న అంశంపై స్పష్టత రావడం లేదు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

గత ప్రభుత్వం 2021లో కొద్దినెలల పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. ఆతర్వాత దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. ఇక రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్పునకు సంబంధించి 2023 చివరి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. ఆతర్వాత కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రకటించినా ఇంకా విధివిధానాలకు వెల్లడించలేదు. దీంతో కొత్తగా కార్డులు అవసరమైన వారే కాక, పేర్లు చేర్చేందుకు దరఖాస్తు చేసుకున్న వారు ఎదురుచూస్తున్నారు.

రేషన్‌కార్డే కీలకం

ప్రతీ ప్రభుత్వ పథకానికి ప్రస్తుతం రేషన్ కార్డు కీలకంగా నిలుస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రజాపాలన సభల్లో పలు పథకాలను దరఖాస్తులను స్వీకరించగా రేషన్‌కార్డు నంబర్ నమోదు చేయాలని సూచించింది. ఇటీవల రఘునాథపాలెంకు చెందిన ఓ వ్యక్తికి గుండె సంబంధిత సమస్య ఏర్పడడంతో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స కోసం రేషన్‌కార్డు అవసరమైంది. కానీ కార్డులో ఆయన పేరు లేకపోవడంతో నానా అవస్థ పడ్డారు. ఇలాంటి వారందరికీ ఎదురుచూపులు ఫలించాలంటే ప్రభుత్వం స్పందించి కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు అవసరమైన వారి పేర్లు చేర్చాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

లాగిన్ల వారీగా పెండింగ్ దరఖాస్తులు	
ఆర్‌ఐలు	23,855
తహసీల్దార్ / ఏఎస్‌ఓలు	2,057
డీఎస్‌ఓ	12,567
మొత్తం	38,479

ప్రభుత్వ ఆదేశాలు రాగానే...



జిల్లాలో రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్చేందుకు దరఖాస్తులు అందాయి. ఇవన్నీ వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పరిశీలించి అర్హులైన వారందరి పేర్లను కార్డుల్లో చేర్చనున్నాం.
– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన వచ్చేనెల 1నుంచి 8వ తేదీ వరకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అగరబత్తీ, ధూప్ స్టిక్స్, టై అండ్ డై, క్యాండిళ్లు, నెయ్యి దీపాలు, ఫ్రిడ్జ్ మాగ్నెట్ తయారీలో శిక్షణ ఇవ్వడమే కాక సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఖమ్మం ఖానాపురం హవేలీ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీ భవాని ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 30వ తేదీలోగా రూ.2వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 96660 13544 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ బెటాలియన్ ఆధ్వర్యాన ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా కేడెట్లకు సోమవారం విజయవాడలోని ఎన్‌డీఆర్‌ఎఫ్(నేచురల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్) ఉద్యోగులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాల నుంచి కాపాడుకోవడంతో గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేయాల్సిన విధానాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్, ఉద్యోగులు పాల్గొన్నారు.

హైవే అలైన్‌మెంట్ మార్చాలని హైకోర్టుకు...

ఖమ్మంఅర్బన్: నాగపూర్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే(ఎన్‌హెచ్ 163–జీ) అలైన్‌మెంట్‌ను ఖమ్మం నగర పరిధిలో మార్చాలని కోరుతూ కొందరు ప్లాట్ల యజమానులు, రైతులు తాజాగాహైకోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. పర్యావరణ అనుమతులు లేకుండా, భూసేకరణలో సరైన పద్ధతులు పాటించకుండానే భూయజమానులతో సంప్రదింపులు కూడా జరపకుండా పనులు ప్రారంభించారని ఆ పిటీషన్‌లో పేర్కొన్నారని సమాచారం. అంతేకాకుండా నోటిఫికేషన్‌లో భూయజమానుల పేర్లు సరిచూడకుండానే పరిహారాన్ని ప్రకటించారని, అది కూడా రూ.కోట్ల విలువైన భూములకు రూ.లక్షల ధర నిర్ణయించారని పిటీషన్‌లో వెల్లడించారని తెలిసింది. ఖమ్మం నగరానికి అవసరం లేని గ్రీన్ ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి రేపు కౌన్సెలింగ్

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు బుధవారం స్పాట్ కౌన్సెలింగ్ ఏర్పాటుచేసినట్లు ఆర్‌సీఓ టీ.వీ.రాజు, ప్రిన్సిపాల్ కె.మానస తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు ఈనెల 26న ఉదయం 10 గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఆధార్ కార్డుల రెండేసి జిరాక్స్‌లు, ఎనిమిది పాస్‌పోర్ట్ ఫొటోలతో రావాలని, వివరాలకు 94910 63083, 96409 47467 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన అనంతరం గిరిజన సంక్షేమ శాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీసు రూల్స్‌ను ప్రకటించాలని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడదల చేయాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, ఎస్.విజయ్, నాయకులు కె.వెంకటేశ్వర్లు, మల్లయ్య, గరికె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,850
పెసలు	7,800	5,500
అలసంద	8,500	8,500
మిర్చి	19,300	10,300
మిర్చి తాలు	10,200	7,500
ఏసీ మిర్చి	20,000	10,000
ఏసీ తాలు	11,100	8,200
పత్తి	7,100	5,000

– ఖమ్మం వ్యవసాయం

ఎరువులు సిద్ధం

ఎరువుల బస్తా ధర (రూ.ల్లో)	
ఎరువు	ధర
యూరియా	267
డీఏపీ	1,350
పొటాష్	1,625
ఎస్ఎస్‌పీ	615
20:20:13	1,250
10:26:16	1,470
28:28:0	1,500
14:35:14	1,700


షాపు గోదాంలో నిల్వ చేసిన ఎరువులు

- సాగు అంచనాలకు అనుగుణంగా అందుబాటులోకి...
- ఇప్పటికే 65 వేల మెట్రిక్ టన్నుల నిల్వ
- ఇందులో 34వేల మెట్రిక్ టన్నులు యూరియా..
- డీఏపీ, పొటాష్ నిల్వలు మాత్రం తక్కువే

ఖమ్మంవ్యవసాయం: జిలాల్లో వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుత సీజన్ 7,03,676 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగవుతాయని అంచనా వేయగా, ఎరువుల కొరత రాకుండా నిల్వ చేస్తున్నారు. ఈ ఏడాది 2,39,795 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. రైతులు వరి పంటకు దుక్కి ఎరువుగా కాంప్లెక్స్ లేదా డీఏపీని వినియోగిస్తారు. ఆ తర్వాత పైరు ఎదుగుదలకు యూరియా, గింజ పటిష్టతకు పొటాష్ ఎరువులను వాడతారు. కొందరు రైతులు దుక్కిలో కాంప్లెక్స్ ఎరువులకు బదులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్(ఎస్ఎస్‌పీ), యూరియాను మిశ్రమంగా కూడా వినియోగిస్తారు. పత్తిలో సైతం దుక్కి ఎరువులు, యూరియా, మిర్చిలో కాంప్లెక్స్ ఎరువులతో పాటు నేలలను బట్టి ఇతర ఎరువులను వాడతారు.

గోదాముల్లో నిల్వ

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లాకు 65 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు చేరుకోగా గోదాముల్లో నిల్వ చేశారు. వీటిని పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసి రైతులకు అందించే ప్రక్రియ మొదలైంది. కాగా, గోదాములన్నీ దాదాపు నిండుగా ఉన్న నేపథ్యాన ఓ పక్క అమ్మకాలు చేపడుతూనే కంపెనీల నుంచి మరిన్ని నిల్వలు తెప్పించేలా ప్రణాళికలు చేశారు. కాగా, ప్రస్తుతం నిల్వ ఉన్న 65 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల్లో సగ భాగం యూరియానే ఉంది. పంటల సాగుకు యూరియా వినియోగం అధికంగా ఉండడంతో నిల్వకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. మరోపక్క డీఏపీ(డై అమోనియా ఫాస్ఫేట్), ఎంఓపీ(మ్యూరేట్ ఆఫ్ పొటాష్) నిల్వలు మాత్రం తక్కువగా ఉన్నాయి. డీఏపీ వినియోగం దుక్కి చేసే సమయం నుంచి ఉండగా, పొటాష్‌ను పంట చివరి దశలో వినియోగిస్తారు. అయితే, డీఏపీ నిల్వలు తక్కువగానే ఉన్నా ఆ స్థానంలో కాంప్లెక్స్ ఎరువులను వినియోగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అవసరమైన ఎరువుల అంచనా... ప్రస్తుత నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువులు	అంచనా	ప్రస్తుత నిల్వ
యూరియా	85,693	33,967
డీఏపీ	33,760	4,762
పొటాష్	27,672	1,960
కాంప్లెక్స్	89,920	23,308
ఎస్ఎస్‌పీ	2,750	1,661
మొత్తం	2,39,795	65,658

ధంసలాపురం చెరువులో చేపల మృత్యువాత


మృతి చెందిన చేపలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెం – ధంసలాపురం మధ్య ఉన్న పెద్ద చెరువులో టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడుతున్నాయి. సోమవారం సైతం చేపలు చెరువులో మృతి చెంది తేలుతుండటంతో మత్యకారులు ఒడ్డుకు తీసుకొచ్చారు. మూడేళ్లుగా చేపలు పట్టకపోవడంతో ఒక్కో చేప 6నుండి 10 కేజీల వరకు పెరగగా, త్వరలో పడదామనుకుంటున్న తరుణంలో మృతి చెందుతుండడంతో తీరని నష్టం ఎదురైందని తెలిపారు. వారం రోజులుగా ఖమ్మం నగరంలోని డ్రెయినేజీలను శుభ్రం చేస్తుండగా ఆ నీరంతా చెరువులోకి చేరి కలుషితం కావడమే చేపల మృతికి కారణమని మత్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 10 టన్నుల మేర మృతి చెందడంతో సుమారు రూ.70లక్షల నుండి రూ.80లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈమేరకు సీపీఐ నాయకులు పోటు ప్రసాద్, భాగం హేమంతరావు, పగడాల మల్లేష్ తదితరులు చెరువును పరిశీలించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో టీఎన్జీవోస్ అధ్యక్షుడు అరెస్ట్

ఖమ్మంక్రైం/ఖమ్మంలీగల్: భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్‌ను ఖమ్మం టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.... సర్వే ల్యాండ్ రికార్డ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అఫ్జల్ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మరికొందరితో కలిసి విజయనగర్ కాలనీ 303 సర్వే నంబర్‌లోని 1,420 గజాల స్థలాన్ని ఏపూరి కోటేశ్వరి నుంచి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ వ్యవహారం బయట పడగాకేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేసి అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రజని ఎదుట హాజరుపరిచారు. దీంతో ఆమె జూలై 5వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా జైలుకు తరలించారు. కాగా, అఫ్జల్ హసనే స్వయంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. గతంలో ఆయనపై ఇంకో కేసు నమోదు కాగా పోలీసులు గాలిస్తున్న విషయం విదితమే.

కలెక్టరేట్‌లో లీకేజీలు...


కలెక్టరేట్ భవనం పైనుంచి నీరు కారుతున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: కొత్త కలెక్టరేట్ భవనం ప్రారంభమై సుమారు ఏడాదిన్నర కావొస్తోంది. అయితే, కలెక్టరేట్ ప్రారంభించిన తొలినాళ్లలోనే పలుచోట్ల నీరు లీకేజీ అవుతుందని అధికారులు గుర్తించి మరమ్మతు చేయించారు. అయితే, ఆదివారం రాత్రి వర్షం కురవగా.. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా చుక్కచుక్కగా పై అంతస్తు నుంచి నీళ్లు కారుతూనే ఉన్నాయి. మున్ముందు భారీ వర్షాలు పడితే పరిస్థితి ఇబ్బంది ఎదురుకానున్నందున శాశ్వత మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఇంటి యజమాని అవమానించాడని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఇంటి యజమాని అవమానించాడనే మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం శ్రీనివాస్‌నగర్ ప్రాంతానికి చెందిన గోళ్ల జనార్దన్‌రావు ఇంట్లో చింతకాయల నాగరాజు(48) తన కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం జనార్దన్‌రావు 'మీ ప్రవర్తన బాగాలేదు..' అని పేర్కొనడమే కాక నాగరాజు భార్య విషయంలో అసభ్యంగా మాట్లాడి ఇల్లు ఖాళీ చేయాలని సూచించాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు జనార్దన్‌రావు అవమానించడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెబుతూ సెల్ఫీ వీడియో తీసి ఆదివారం పురుగుల మందు తాగాడు. ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు జనార్దన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

పోలీసుల అదుపులో చైన్ సిస్టమ్ నిర్వాహకుడు?

నేలకొండపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన గొలుసు కట్టు స్కీం నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. సోమవారం తెల్లవారుజామున ఆయనను ఇంట్లో అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాలతో పాటు సూర్యాపేట జిల్లాకు చెందిన పలువురు ఆయన వద్ద ఓ సంస్థ స్కీంలో రూ.లక్షల మేర పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తుంది. అయితే, ప్రీమియం గడువు ముగిసినా నగదు తిరిగి రాకపోవడంతో మూడు రోజులుగా ఆయన ఇంటి వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈవిషయమై రంగంలోకి దిగిన పోలీసులు బాధితుల వివరాలు ఆరాతీశాక నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని ఖమ్మం తరలించినట్లు సమాచారం. ఈ విషయమై నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు ను వివరణ కోరగా వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి(35) మృతి చెందిన ఘటన జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. ఖమ్మం – మల్లెమడుగు స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో తలకు బలమైన గాయమైందనే సమాచారం జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు చేరుకున్నారు. అనంతరం అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో క్షతగాత్రుడిని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మాటల్లో పెట్టి మహిళ మెడలో గొలుసు చోరీ


చోరీ జరిగిన ప్రాంతంలో విచారిస్తున్న పోలీసులు

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మహిళ మెడలో నుంచి బంగారపు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన ఇది. ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ... వెంకటాపురానికి చెందిన గొర్రాజు మహేశ్వరి తన భర్త రాంబాబుతో కలిసి మద్యం దుకాణం వద్ద హోటల్ నడుపుతోంది. గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం హోటల్‌కు వద్దకురాగా, ఆమెను మాటల్లో పెట్టి చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని మహేశ్వరి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని బైక్‌పై ఉడాయించాడు. దీంతో నిర్ఘాంతపోయిన ఆమె కేకలు వేసే లోగా నిందితుడు పారిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు వైరా ఏసీపీ రహమాన్, మధిర సీఐ మధు, ఎస్ఐ పి.వెంకటేష్ చేరుకుని వైన్స్‌తో పాటు సమీప షాపుల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి విచారణ చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఎంపీగా రఘురాంరెడ్డి ప్రమాణస్వీకారం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం పార్లమెంట్ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మెజార్టీతో విజయం సాధించారు. ఈనేపథ్యాన ఆయన ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని నాయకులు పలువురు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు.

డ్రైవర్, కండక్టర్ నిజాయితీ


ప్రయాణికుడికి బ్రాస్‌లెట్ అందజేస్తున్న డీఎం, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను డ్రైవర్, కండక్టర్ తిరిగి అప్పగించారు. ఖమ్మం డిపోకు చెందిన బస్సు సోమవారం భద్రాచలం రూట్‌లో నడిచింది. భద్రాచలంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బండారుపల్లి సుధాకర్ బస్సులో 12 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్ పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన ఖమ్మం డిపోలో సంప్రదించగా.. అప్పటికే కండక్టర్ వి.మల్లికాంబ, డ్రైవర్ జి.లక్ష్మయ్య అధికారులకు అందజేశారు. దీంతో బ్రాస్‌లెట్ సుధాకర్‌దేనని నిర్ధారించుకున్న డీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులు ఆయనకు అప్పగించగా డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

గంజాయి రవాణాదారులకు పదేళ్ల జైలుశిక్ష, జరిమానా

ఖమ్మం లీగల్: గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ఖమ్మంకు చెందిన పడిమల శివ, బానోత్ లక్ష్మణ్, సంగెపు భాస్కర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఖమ్మం–1 ఎక్సైజ్ పోలీసులు 2022 మార్చి 28న తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంపై నాలుగు గంజాయి తరలిస్తూ శివ, లక్ష్మణ్, భాస్కర్ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, కేసును విచారించిన న్యాయమూర్తి జైలుశిక్ష, జరి మానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎ.శంకర్ వాదించగా, ఉద్యోగులు కె.మోహన్‌రావు, టి.మారేశ్వర్రావు, ఎండీ.అయూబ్ సహకరించారు. కాగా, గంజాయి అమ్మకందారులకు శిక్ష పడేలా కృషి చేసిన ఉద్యోగులకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల హాసన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బాలపేట తండాకు చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ వెంకన్న కానరాకుండా పోయాడని ఆయన భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 17న మిత్రులతో కలిసి తిరుపతి వెళ్తున్నానని చెప్పిన ఆయన దుస్తులు, రూ.2లక్షల వెళ్లి తిరిగి రాకపోగా ఫోన్ కూడా స్విచాఫ్ వస్తోంది. దీంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పత్తిపాటి వర్షిత(24) ఈనెల 21న పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ముత్తగూడెం గ్రామానికి చెందిన వర్షితకు రామకృష్ణాపురం వాసి సుమంత్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల బాబు ఉన్నాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమె పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న వర్షిత మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చిమ్మపూడి మహిళ..

ముదిగొండ: కుమారుడితో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రఘునాథపాలెం మండలం చిమ్మపూడికి చెందిన కణతాల నర్సమ్మ(55), ఆమె కుమారుడు గిరి ఆదివారం ముదిగొండ మండలం సువర్ణాపురం సమీపాన పురుగుల మందు తాగారు. స్థానికులు గుర్తించి వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా నర్సమ్మ మృతి చెందింది. కాగా, వీరిద్దరు కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగారని నర్సమ్మ మరో కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లుముదిగొండ ఎస్ఐ గజ్జెల నరేష్ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

■ న్యూవిజన్...


విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ(బెటర్‌మెంట్) పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు జి.లలానిక చౌదరి, సీహెచ్.ప్రణయ్ 468 మార్కులతో రాష్ట్ర ప్రథమస్థానంలో నిలవగా, పి.రుత్విక, పి.శశాంక్, పి.ఆస్రిత, పి.యోగిత, సీహెచ్.నిషిత, డి.ప్రణతి, పి.మనస్వి చౌదరి, ఎస్.స్నేహిత, జి.రిషిత, ఇ.వేదసంహిత, ఆర్.అజిత, ఎస్.మనస్విక, జి.యశ్విత్, డి.ప్రణీత్, జి.భవ్య 467, బైపీసీలో 440 మార్కులకు వై.సూర్యతేజ 437 మార్కులు, ఎస్.గ్రీష్మ వెంకటరమ్య, ఆర్.రూపశ్రీ, బి.యశ్వంత్, ఎం.బిందు ప్రియ, ఆర్.శీతల్, ఎం.ఆకాంక్ష, టి.నవీన 436, జె.సిరి 435 మార్కులు సాధించారని వెల్లడించారు. ఈసందర్భంగా చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు సీహెచ్.గోపీచంద్, సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాళ్లు బ్రహ్మచారి, శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు.

■ భవిష్య మెడికల్ అకాడమీ...


విద్యార్థులతో డైరెక్టర్ రామిరెడ్డి, తదితరులు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని భవిష్య అకాడమీ డైరెక్టర్ బండి రామిరెడ్డి తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు గాను 438 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన ఎస్‌కే..సనను ఆయన అభినందించారు. అలాగే, 440మార్కులకు గాను తమ విద్యార్థులు 438మార్కులు, 436, 436, 435, 435, 133,432, 432, 431, 431, 430మార్కులు సాధించారన్నారు. అకాడమీ చైర్మన్ శ్రీలత, జనరల్ మేనేజర్ వీ.ఎస్.ఎస్.మూర్తి, ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ సీఈసీలో ఆర్‌జేసీ విద్యార్థి..


పి.కార్తీక్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బెటర్‌మెంట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని ఆర్‌జేసీ జూనియర్ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. తమ విద్యార్థి పి.కార్తీక్ సీఈసీలో 500కి 472మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థిని చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీపతి, ఇన్‌చార్జి టి.ఉపేందర్ అధ్యాపకులు అభినందించారు.

■ శ్రీచైతన్య...


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, తదితరులు

ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. జూనియర్ ఎంపీసీలో అత్యధికంగా ఎనిమిది మంది 470కి 468 మార్కులో రాష్ట్రస్థాయిలో సత్తా చాటారని, జూనియర్ బైపీసీలో ఇద్దరు 440 మార్కులకు 438 మార్కులు సాధించారని వెల్లడించారు. జూనియర్ ఎంపీసీలో ఏ.సాయితేజ, ఎస్.సాకేత్, జి.రిషిక, కె.మణికీర్తి, పి.ప్రణతి, ఎస్.వినీల, టి.ఉత్తేజిత, బి.గణేష్ 468, జూనియర్ బైపీసీలో బి.రిషిత, జి.గీతిక 438, ఎ.జ్యోత్స్న, ఎం.మనీష, వి.ప్రియాంక 437 మార్కులు సాధించారని తెలిపారు.

సింగరేణిని పరిరక్షించండి

సీపీఐ జిల్లా సమితి సమావేశంలో నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు బ్లాక్‌ల వేలంతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నందున సంస్థ పరిరక్షణకు బొగ్గుబావులను సింగరేణికి అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సంఘాలు, జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ బొగ్గు బ్లాక్‌ల వేలానికి పరోక్షంగా అనుమతించగా కోయగూడెం, సత్తుపల్లి గనులు ప్రైవేటు పరమయ్యాయనని తెలిపారు. మళ్లీ ఇప్పుడు మరో బ్లాక్‌లను వేలం వేసేందుకు సిద్ధమైనందున ప్రభుత్వం అడ్డుకోవాలని సూచించారు. కాగా, కేంద్రంలో మోడీ పాలన లీక్‌ల మయమైందని.. నీట్–నెట్ పరీక్షల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకు ఖమ్మంలో జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మహ్మద్ మౌలానా, మహ్మద్ సలాం, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కాంగ్రెస్‌పై ఒత్తిడి

- బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తే బీఆర్‌ఎస్‌తోనైనా కలిసి పనిచేస్తాం...
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

నేలకొండపల్లి: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలు తప్పవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. నేలకొండపల్లి మండలం బోదులబండలో సోమవారం మొదలైన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కచ్చితంగా అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఒకవేళ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలను సమీకరించి పోరాటాలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఇదే సమయాన రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమించిన పక్షాన ఆ పార్టీతో కలిసి పని చేయడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కేంద్రంలో మోడీ గ్రాఫ్ పడిపోతోందని చెప్పడానికి సంకేతంగా నిలిచాయని వెల్లడించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాల్లో విఫలం కాగా, దక్షిణాది రాష్ట్రాల్లో పొత్తుల కారణంగా కొద్ది మేర లాభం జరిగిందన్నారు. ఏదిఏమైనా పాలనాపరమైన ఏకపక్ష నిర్ణయాలకు కళ్లెం వేసినట్లు అయిందని తెలిపారు.

మరోపక్క దేశంలో వామపక్షాల బలం, సీట్ల సంఖ్య కొంత మేర పెరిగిందన్నారు. కాగా, లోక్‌సభ ఫలితాలపై ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే కేంద్ర కమిటీ సమావేశాలలో సమీక్షించుకోనున్నట్లు తమ్మినేని తెలిపారు. ఇదేసమయాన ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీతో ఎలా వ్యవహరించాలనే విషయంపైనా చర్చిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, షేక్ బషీరుద్దీన్, ఏటుకూరి రామారావు, కే.వీ.రెడ్డి, దుగ్గి వెంకటేశ్వర్లు, భూక్యా కృష్ణ, కట్టికోల వెంకన్న, రచ్చా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.